క్లుప్తంగా

ఘనంగా అక్కమాంబ ఆలయ పున:ప్రతిష్ఠాపనోత్సవం



పూజలందుకుంటున్న అమ్మవారు

పొందూరు: కోర్కెలు తీర్చే కల్పవల్లి, నాగవంశస్తుల ఇలవేల్పు అక్కమాంబ తల్లి ఆలయ పున:ప్రతిష్ఠాపనోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో భక్తులు ఇచ్చిన విరాళాలతో ఆలయం పునర్నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా హోమాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు



జాగిలాలతో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఆమదాలవలస: ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణ చర్యల్లో భాగంగా శుక్రవారం ఆమదాలవలస రైల్వే స్టేషన్, పరిసర ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. స్థానిక పోలీసులు, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సంయుక్తంగా ప్రత్యేక పోలీసు జాగిలాలతో ప్రయాణికుల లగేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులు అవగాహన కల్పిస్తూ అపరిచిత వ్యక్తుల లగేజీ బ్యాగులను, ఇతర సామగ్రిని ఏ ఒక్కరు తమ వద్ద ఉంచుకోరాదని స్పష్టం చేశారు. తనిఖీల్లో ఎస్సై సనపల బాలరాజు, జీఆర్‌పీ ఎస్‌ఐ మధుసూదనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వైశాఖ మాస బహుళ ఏకాదశి సందర్భంగా శుక్రవారం పార్వతీ పరమేశ్వరుల తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు హారతులిచ్చారు.

ఆలయ భూములు కౌలుకు వేలం

నరసన్నపేట: మండలంలోని కామేశ్వరిపేటలో ఉమాకామేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూములను రానున్న మూడేళ్లకు కౌలుకు ఇచ్చేందుకు వేలం నిర్వహించనున్నామని ఈఓ సర్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న సచివాలయం వద్ద గ్రామపెద్దలు, దేవదాయ అధికారుల సమక్షంలో వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. మొత్తం 17.33 ఎకరాల భూములు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల వారు రూ. 500 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

కళాకారుల సమావేశం రేపు

ఆమదాలవలస: పట్టణంలోని లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఈ నెల 25న ఉదయం 9 గంటలకు జరిగే కళాకారుల సంక్షేమ సంఘ సమావేశానికి నియోజకవర్గ కళాకారులంతా తరలిరావాలని సంఘం అధ్యక్షుడు టీకి త్రినాథరావు, సహాధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దనరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుర్తింపు కార్డులు, ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నూతన కార్యవర్గ ఎంపిక ఉంటుందని తెలిపారు.

చెవిటమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న రవికుమార్

ఆమదాలవలస: పట్టణ శివారులో పాత ఆమదాలవలస, ఆమదాలవలస గేటు ప్రాంతాల గ్రామదేవత చెవిటమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమదాలవలస నియోజవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పొదిలాపు తిరుపతిరావు, బండి యర్రన్నాయుడు, పురుషోత్తం, వెంకటేష్, హేమంత్, ధనుంజయ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రారంభానికి మోక్షమెప్పుడో?



పనులు పూర్తయిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనం

- పనులు పూర్తయినా పట్టించుకోని పాలకులు
- నిరుపయోగంగా మారిన భవనాలు



పెద్దకొల్లివలస పునరావాస కాలనీలో ప్రారంభోత్సవానికి నోచుకోని గ్రామ సచివాలయ భవనం

ఎల్.ఎన్.పేట: ప్రజల వద్దకే పాలన తీసుకురావాలనే సమున్నత ఆశయంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజా పరిపాలనలో భాగంగా విధులు నిర్వహించే అధికారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడకూడదని భావించిన గత ప్రభుత్వం గ్రామ సచివాలయ పరిపాలన కోసం శాశ్వత భవనాలు నిర్మించింది. గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ కార్యాలయాలకు సంబంధించి పాతపట్నం నియోజకవర్గంలో పలు భవనాల నిర్మాణ పనులు గత ప్రభుత్వమే పూర్తి చేసింది. కొన్నిచోట్ల నిర్మాణాలు పూర్తయ్యే సరికి ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో వాటిని ప్రారంభించకుండా వదిలేశారు. ఇందుకు ఉదాహరణగా ఎల్.ఎన్.పేట మండలంలోని పెద్ద కొల్లివలస పునరావాస కాలనీలో నిర్మించిన భవనాలు చెప్పుకోవచ్చు. పునరావాస కాలనీలో సామాజిక (కమ్యూనిటీ) భవనంలో గ్రామ సచివాలయంతో పాటు ఇతర శాఖలకు సంబంధించిన పరిపాలనను ప్రారంభించారు. శాశ్వత భవనాలు ఉన్నప్పటికీ కమ్యూనిటీ భవనంలోనే ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తూ.. అనేక ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు నిర్మాణం పూర్తయినా భవనాలు ప్రారంభించకపోవటంతో భవనాలు చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నాయి. ఫ్లోరింగ్ నుంచి పిచ్చిమొక్కలు పుట్టి భవనాలు పాడవుతున్నాయి. పనులు పూర్తయినా ప్రారంభించేందుకు నిర్లక్ష్యం ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి గ్రామ సచివాలయం, విలేజ్ క్లినిక్ తదితర భవనాలు ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

పరిశీలిస్తాం..



గ్రామ సచివాలయంతో పాటు ఇతర భవన నిర్మాణం పూర్తయినా ఎందుకు ప్రారంభించలేదో తెలియదు. బిల్లుల చెల్లింపులో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? మరేదైనా సమస్య ఉందా అడిగి తెలుసుకుంటాను. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి భవనాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాను.

– పైడి శ్రీనివాసరావు, ఎంపీడీఓ, ఎల్.ఎన్.పేట

ఉపాధి వేతనదారులతో మహానాడు



సమావేశంలో మాట్లాడుతున్న చింతాడ రవికుమార్, పార్టీ నాయకులు

- ఆమదాలవలస వైఎస్సార్ సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ఆమదాలవలసలో బుధవారం నిర్వహించిన టీడీపీ మినీ మహానాడుకు వచ్చిన జనాలంతా ఉపాధి హామీ వేతనదారులేనని, వారికి మస్టర్లు వేసి మహానాడుకు తరలించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక వైఎస్సార్ సీపీని తిట్టడమే ప్రధాన అజెండాగా మహానాడు సాగిందని విమర్శించారు. పాలనలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని దుయ్యబట్టారు. ప్రజలకు సమాధానం చెప్పలేక కూటమి నాయకులు బెదిరింపులకు పాల్పడుతూ అక్రమ కేసులు బనాయిస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. సూపర్ సిక్స్‌లో ఒక్క పథకాన్ని కూడా అమలుచేయలేని కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేస్తూ సంపదనంతా అమరావతిలో పెడుతోందని ధ్వజమెత్తారు. అభివృద్ధిని వైఎస్సార్‌సీపీ అడ్డుకుంటోందని కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేలు వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లాలో అభివృద్ధి జరిగిందే వైఎస్సార్ సీపీ హయాంలోనని స్పష్టం చేశారు. దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఇసుక దోపిడీ చేస్తూ రోజుకు సుమారు కోటి రూపాయలు స్వాహా చేస్తున్నారని మండిపడ్డారు. లిక్కర్ షాప్‌లలో 20 శాతం మామూళ్లు వసూలుచేసుకుంటూ దోపిడీ చేసిన సొమ్ముతో అమెరికాలో హోటల్ కట్టడానికి సన్నాహాలు చేస్తున్నారని ఆరోపించారు. అరాచక పాలనను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. సమావేశంలో సరుబుజ్జిలి జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, సరుబుజ్జిలి మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, ఆమదాలవలస పట్టణ పార్టీ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, ఆమదాలవలస మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్లను తొలగించడం తగదు



జలుమూరు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎండీయూ ఆపరేటర్లు



మెళియాపుట్టి: డీటీ రాముకు వినతిపత్రం అందిస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

జలుమూరు: ప్రజలకు నిత్యావసర సరుకులు ఇంటికి చేర్చే ఎండీయూ వాహనాలు రద్దు చేసి ఆపరేటర్లను తొలగించడం అన్యాయమని పలువురు ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం జలుమూరు తహసీల్దార్ జెన్ని రామారావుకు వినతి పత్రం అందించారు. ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు.

మెళియాపుట్టి: ఎండీయూ ఆపరేటర్లను తొగించే ప్రక్రియను ప్రభుత్వం విరమించుకోవాలని పలువురు ఆపరేటర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ రాముకు వినతిపత్రం అందించారు. 22 నెలల అగ్రిమెంట్ ఉండగానే కూటమి ప్రభుత్వం తొలగించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సారవకోటలో..

సమస్యల కొలువు



సారవకోటలో రిక్షాపై తాగునీటి బిందెలను తీసుకొస్తున్న స్థానికుడు



బజారువీధిలో నిలిచిన మురుగునీరు

- తాగునీటికి ఇబ్బందులు
- అధ్వానంగా పారిశుద్ధ్య నిర్వహణ
- పట్టించుకోని అధికారులు

సారవకోట: మండల కేంద్రం సారవకోటలో సమస్యలు తిష్ఠ వేశాయి. తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఇబ్బందులతో ప్రజలు సతమతమవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రధానంగా తాగునీటి సమస్య స్థానికులను తీవ్రంగా వేధిస్తోంది. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన రక్షిత మంచి నీటి పథకం అంతంత మాత్రంగా పనిచేయడంతో కొన్ని వీధులకు మాత్రమే సాగునీరు అందుతోంది. అది కూడా వారానికి మూడు, నాలుగు రోజుల్లో అరగంట పాటు నీరు సరఫరా అవుతుంటుంది. ఈ గ్రామానికి జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేసేందుకు పైపులైన్ తవ్వకాలు చేపట్టారు. కొన్నిచోట్ల మాత్రమే పైపు లైన్లు వేసి మిగిలిన వీధులను వదిలేశారు. నిత్యం రద్దీగా ఉన్న వీధుల్లో తవ్వకాలు చేపట్టి అసంపూర్తిగా వదిలేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడక్కడ తాగునీటి బోర్లున్నా తాగేందుకు పనికి రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా పరిసరాలు..

స్థానిక శివరామ పాత్రుని కోనేరు పిచ్చిమొక్కలతో నిండిపోయింది. కోనేరు గట్టుపై శివాలయం, నరసింహస్వామి, సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలున్నాయి. నిత్యం భక్తులు ఆలయాలకు వస్తుంటారు. అయితే కోనేరు పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో నీటిని వినియోగించుకునేందుకు అవకాశం లేకుండాపోతోంది. మరోవైపు, కాలువలు పూడికలతో నిండిపోయాయి. దీంతో ఎక్కడికక్కడే మురుగునీరు నిలిచిపోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి..



మండల కేంద్రంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఈ విషయాన్ని పలుమార్లు మండల సర్వసభ్య సమావేశంలో సభ దృష్టికి తీసుకొచ్చాను. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– గుణుపురం రామారావు, ఎంపీటీసీ సభ్యుడు, సారవకోట

దేశవానిపేట విద్యార్థికి 123వ ర్యాంకు



కింజరాపు రోహిత్

నరసన్నపేట: దేశవ్యాప్తంగా సైనిక్ స్కూల్స్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ఏఐఎస్ఎస్ఈఈ-25 ఎంట్రన్స్ టెస్టులో దేశవానిపేటకు చెందిన కింజరాపు రోహిత్ రాష్ట్ర స్థాయిలో 123వ ర్యాంకును సాధించాడు. ఆలిండియా స్థాయిలో 1751వ ర్యాంకు లభించింది. 300 మార్కులకు గాను 271 మార్కులు సాధించాడు. రోహిత్ తండ్రి మూర్తి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

నేడు విద్యుత్ కోత

పొందూరు : పొందూరు సబ్‌స్టేషన్ పరిధిలోని పొందూరు టౌన్ ఫీడర్, దేవరవలస ఫీడర్, ఇండస్ట్రియల్ ఫీడర్, కృష్ణాపురం ఫీడర్, సిరిపురం ఫీడర్, రాపాక, కొంచాడ, తండ్యాం, మలకాం పంచాయతీల పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వి.సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ప్రజలు గమనించాలని కోరారు.

కాలువలో వాహనం బోల్తా



పోలాకి: బెలమర వద్ద డీపీఎస్ రహదారిపై టాటామ్యాజిక్ వాహనం అదుపు తప్పి కాలువలో బోల్తాపడింది. ఈ ఘటనలో ఘటనలో ఇద్దరు గాయపడినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. సంతబొమ్మాళి మండలం ఉద్దండపాలెం నుంచి పోలాకి మండలం నర్సాపురంలోని శుభ కార్యక్రమానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. క్షతగాత్రులను 108 అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్టాక్‌పాయింట్ పరిశీలన

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభోత్సవం నాటికి విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగులు ఇతర కానుకలు అందేలా సమాయత్తం కావాలని ఉప విద్యాశాఖాధికారి విజయకుమారి అన్నారు. ఈ మేరకు నరసన్నపేటలోని ఎస్‌ఆర్‌కేవీఎం విద్యా కానుకల స్టాక్ పాయింట్‌ను శుక్రవారం పరిశీలించారు. ఎంఈఓలు యూ.శాంతారావు, పి.దాలినాయుడులకు పలు సూచనలు చేశారు.

బదిలీలకు దరఖాస్తు చేసుకోండి

హిరమండలం: ఉపాధ్యాయ బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో రాంబాబు సూచించారు. శుక్రవారం ఎమ్మార్సీ కార్యాలయంలో బదిలీలపై సమీక్షించారు. మండలంలో 53 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, కొత్తగా వచ్చిన ఖాళీల సంఖ్య 28 కాగా.. ఎనిమిదేళ్లకు సంబంధించి ఖాళీలు 20 ఉన్నాయని తెలిపారు.

రవిబాబును కలిసిన నాయకులు



రవిబాబుతో కొత్తూరు మండల నాయకులు

కొత్తూరు: జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి శుక్రవారం విచ్చేసిన పార్టీ శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకుడు కుంబా రవిబాబును కొత్తూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గండివలస ఆనందరావు, నాయకులు బూర్లె శ్రీనివాసరావు, తిర్లంగి కృష్ణమోహన్, అగతమూడి నాగేశ్వరరావు, సవర రమేష్, సంజీవరావు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ఆమదాలవలస: సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహించి పలు వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, సనపల డిల్లేశ్వరరావు, నూక రాజు, రాంబాబు పాల్గొన్నారు.

పేరుకుపోయిన గుర్రపు డెక్క



కొత్తకోట పెద్ద చెరువులో అభివృద్ధి పనులు చేయకపోవడంతో గుర్రపు డెక్క భారీగా పేరుకుపోయింది. వంశధార ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న ఈ చెరువుద్వారా దిగువన సుమారు 600 ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందించాలి. ఖరీఫ్ సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు స్పందించి గుర్రపు డెక్క తొలగించాలని రైతులు కోరుతున్నారు. - సరుబుజ్జిలి

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు



సారవకోట నుంచి కిడిమి వెళ్లే రహదారి పక్కన కిడిమి గ్రామ సమీపంలో ఉపాధి హామీ పథకం కింద వేసిన కొబ్బరిచెట్లు ప్రస్తుతం కాపు దశకు చేరుకున్నాయి. ఇలాంటి తరునంలో విద్యుత్ శాఖ కాంట్రాక్టర్లు సుమారు 20 కొబ్బరి చెట్లను నరికి కొత్త లైన్ వేస్తున్నారు. ఓ వైపు పర్యావరణాన్ని కాపాడండి అంటూ ప్రభుత్వాలు చెబుతుంటే మరోవైపు ఇలా చెట్లను నరికివేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. - సారవకోట

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవం



పురుషోత్తపురంలో భూనీలాసమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు తమ్మినేని కోదండ రామాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పండిత పరిషత్, సహస్రనామార్చనలు, హోమాలు జరిపించారు. ఆలయ ధర్మకర్త నానుపాత్రుని రామమూర్తి, అర్చకులు నానుపాత్రుని గుర్నాధరావు, భక్తులు పాల్గొన్నారు. - సరుబుజ్జిలి

సర్వే కాదండోయ్..



చిత్రాన్ని చూసి రోడ్డు సర్వే చేస్తున్నారని అనుకుంటే పొరపాటే. కొత్తూరులోని పాలకొండ రోడ్డు త్రినాథ స్వామి ఆలయం వద్ద పెద్ద గొయ్యి ఏర్పడింది. వానలు పడుతుండడంతో నీరు నిల్వ ఉండి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో స్థానికులే ఇలా కర్రలను హెచ్చరికగా పెట్టారు. – కొత్తూరు

సంక్షిప్తంగా..

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



నరసన్నపేట: నిత్యజీవితంలో యోగా భాగం కావాలని, అప్పుడే మరింత ఆరోగ్యవంతంగా, ఆత్మస్థైర్యంతో జీవించగలమని మాకివలస ఆయుష్ వైద్యాధికారి సీతామహాలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ యోగా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మడపాంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి యోగా ఆవశ్యకత, ఆయుష్ మందుల ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో మడపాం ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

ఎల్.ఎన్.పేట: బొత్తాడసింగి పంచాయతీ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ఈగల ధర్మారావుపై డ్వామా పీడీ పి.రాధ శుక్రవారం విచారణ చేపట్టారు. ధర్మారావుతో పాటు కొందరు మేట్లు పనిలోనికి రానివారి పేర్లను మస్టర్‌లో వేసి వారితో కలిసి డబ్బులు తీసుకుంటున్నారని అదే పంచాయతీకి చెందిన అంపిలి పోలినాయుడు, శివ్వాల కిశోర్ బాబు, కొమరాపు తిరుపతిరావు, మరికొందరు వేతనదారులు డ్వామా పీడీకి ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామ సచివాలయం వద్ద విచారణ చేపట్టామని ఏపీడీ తెలిపారు. మధ్యాహ్న భోజనం పథకం వంట నిర్వాహకురాలు టి.అమృత కుమారి పాఠశాల పనివేళల్లో ఉపాధి పనులకు వెళ్లినట్లు నమోదైందని, ఒకేసారి వంట, పని ఎలా సాధ్యమని పోలినాయుడు ఆరోపించారు. కాగా, వేసవి సెలవుల్లో మాత్రమే తాను పనిలోకి వెళ్లానని అమృతకుమారి తెలిపారు. సమగ్ర విచారణ చేసి తుది నివేదిక పీడీకి అందజేస్తామని ఏపీడీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పైడి శ్రీనివాసరావు, ఏపీఓ వి.శ్రీదేవి, సర్పంచ్ ఈగల భవాని తదితరులు పాల్గొన్నారు.

నీలాదేవిపురంలో శ్రమదానం

బూర్జ: నీలాదేవిపురంలో శుక్రవారం శ్రమదానం నిర్వహించారు. గ్రామ శివాలయం నుంచి కాలనీ వరకు రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారాలు తొలగించారు. కాగా, గ్రామానికి సీసీ రోడ్డు మంజూరైనా పనులు చేపట్టకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని కాలనీకి చెందిన బురిడి కృష్ణ, పొన్నాడ రమణమూర్తి, బురిడి వరహాలమ్మ, దుప్పాడ గురుమూర్తి, సాకేటి భాస్కరరావు, మండల వెంకటరమణ, పొన్నాడ సత్యవతి, పొన్నాడ తమ్మినాయుడు ఆవేదన వ్యక్తం చేశారు.

బాల్య వివాహాలు నేరం

పాతపట్నం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పాతపట్నం సీడీపీవో టి.విమలరాణి అన్నారు. తెంబూరు అంగన్‌వాడీ కేంద్రంలో వేసవి శిక్షణలో భాగంగా బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ఫలితాలపై కిశోర బాలికలకు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ డి. అమరావతి, సోషల్‌వర్కర్ జనార్దనరావు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పాతపట్నం: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన శనివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో టి.చంద్రకుమారి తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

పొందూరు: తుంగపేటలో మంజూరైన రోడ్డు నిర్మాణానికి ఎట్టకేలకు అడ్డంకులు తొలిగాయి. శుక్రవారం పోలీసుల సమక్షంలో రోడ్డు ఆక్రమణలను తొలగించారు. ఎస్‌ఐ వి.సత్యనారాయణ, ఎంపీడీవో మన్మథరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధి రేటు పెంచాలి

జలుమూరు : ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయంలో 15 శాతం వృద్ధి రేటు పెంచడానికి వ్యవసాయ అధికారులు ప్రణాళికబద్ధంగా పనిచేయాలని ఎంపీడీఓ కె.అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిష్ సమావేశ మందిరంలో వ్యవసాయ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఏఓ కె.సురేష్ కుమార్, ఉద్యానవన శాఖాధికారి మంగమ్మ పాల్గొన్నారు.